2004 జనవరి 12వ తేదీ ఉదయం సాయికుల్వంత్ లో  భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం

# తల్లిదండ్రులను గౌరవించండి
# వారి ఆజ్ఞను శిరసావహించండి

*దినకరుడు శాంతుడై తోచె దినములింక*
*కురచనయ్యె చలిగాలి చురుకు హెచ్చె*
*పొలములన్ రేయి గ్రుడ్డి వెన్నెలలోన*
*కుప్పలన్ నూర్చు కాపులు గొంతులెత్తి*
*పదములన్ పాడదొడగిరి పచ్చపూలు*
*జనపచేలకు ముత్యాల సరులుగూర్చె*
*మిరప పండ్లకు కుంకుమ మెరుపుదాల్చి*
*బంతిపువ్వుల మొగములల్లంత విప్పి*
*మన గృహంబుల ధాన్యసంపదలు నిల్పి*
*సరసురాలైన పుష్యమాసంబునందు*
*పరగనొప్పుచు సంక్రాంతి పండుగొచ్చె.*

ప్రేమస్వరూపులారా! అన్ని పండుగల కంటే సంక్రాంతి పండుగ చాలా ముఖ్యమైనది. రైతుల కడుపులను నింపి, పేదలకు అన్నం ప్రసాదించి, అందరికీ ఉల్లాసమును, ఉత్సాహమును కల్గిస్తుంది. ఈ పండుగకు అనేక పంటలు ఇంటికి చేరుకుంటాయి. చెఱకుపంట మాధుర్యమును అందిస్తుంది. ప్రతి ఒక్కరూ ఈనాడు పాయసమునో, పరమాన్నమునో, లేక భక్ష్యములనో చేసుకొని భుజిస్తారు. గృహస్థులకుకూడా ఈ పండుగ ఎంతో వైభవాన్ని అందిస్తుంది.

*అన్ని పండుగలకంటె ముఖ్యమిది కాన*
*అత్తవారింటికేగుమో కొత్త పెండ్లి కొడుక!*
*అందు నీకెక్కువ సుఖముగల్గు*

sri sathyasaivachanamrutam

*ముద్దు మరదలు నీతోడ ముచ్చటాడు*
*వదిన మాటికి నీతోడ వరుసలాడు*
*ఊరివారంత మన్ననలతిగ సల్ప*
*మామ కూడ అడుగులకు మడుగులొత్తు*
*పోయి రావయ్య అత్తవారింటికి నీవు"*

అంటూ గ్రామసీమల్లో కొత్త పెండ్లి కొడుకులను అత్తవారింటికి వెళ్ళవలసిందిగా ప్రోత్సహిస్తుంటారు. ఈ పండుగరోజులలో వాతావరణము ఎంతో ఆహ్లాదకరముగా, మాధుర్యముతో నిండి ఉంటుంది. తెల్లవారేసరికి చల్లనిగాలి మెల్లని రాగము తీస్తూ ప్రజలను మేల్కొల్పుతూ ఉంటుంది. ఈ రహస్యమును గుర్తించుకోలేక కొందరు "సంక్రాంతి చల్లనిగాలితో వస్తుంది, బయటికి పోనివ్వదు" అని అనుకొంటారు. ఇది చాలా పొరపాటు.

ఈ సంక్రాంతి చల్లనిగాలులతో మనసుల్ని మెత్తపరచి అందరికీ ఉల్లాసాన్ని కల్గిస్తుంది. రైతులు ఆనందముగా గొంతువిప్పి పదములను పాడుతుంటారు. విప్రులు బ్రహ్మముహూర్తకాలమున లేచి వేద పఠనము చేస్తుంటారు. ఐదు సంవత్సరములు వచ్చిన పిల్లలకు ఈ పండుగదినములలో అక్షర స్వీకారము చేయిస్తారు; వేదాధ్యయనము గావింపజేస్తారు. అందులో ఋగ్వేదము చాలా ప్రధానమైనది. ఋగ్వేదములోని మంత్రములు భగవంతునియొక్క దివ్యానంద స్వరూపమును ప్రజల మనస్సులలో నింపి వారిలో ఆధ్యాత్మికభావములను పెంపొందిస్తాయి. ఈ పండుగ దినములలో బీదలు మొదలుకొని ధనికుల వరకు అందరూ తెల్లవారుఝామున లేచి వారివారి ఇష్టదైవములను పూజిస్తుంటారు. శివభక్తులు గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడు మరియు పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేకపూజలు చేస్తుంటారు.

*మౌళిగుల్కెడు చంద్రమఃఖండ కళతోడ*
*బెడగారు గుంపెడు జడలతోడ*
*జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ*
*దంబైన ఫాలనేత్రంబుతోడ*
*నల్లనేరెడువంటి నల్లని మెడతోడ*

sri sathyasaivachanamrutam

నడమున చుట్టిన నాగచర్మముతోడ
మైనిండ నలదు భస్మంబుతోడ
నుదుట దీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో
తాంబూల రాగాధరంబుతోడ
ఆరు శాస్త్రములందున నందగించి
నల్ల కలువల హసియించి కొల్లలాడు
మెరుగు చామనఛాయల మేనితోడ...."

ఈవిధముగా ఈశ్వరస్వరూపమును వర్ణించుకుంటూ, ధ్యానించుకుంటూ వారిలో వారు ఎంతో ఆనందమును అనుభవిస్తుంటారు. ఈరీతిగా, సంక్రాంతి పండుగ పిల్లలు, పెద్దలు, రైతులు, బ్రాహ్మణులు మొదలైన వారందరికీ ఎంతో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కల్గిస్తుంది. ఇంతేకాదు; ఈ సంక్రాంతి సందర్భంగా ఆవులను,కోడెలను అలంకరించి వాటికి సీతారాములని పేర్లు పెట్టి పెండ్లి చేస్తారు. గంగిరెద్దులకు రాముడని, భీముడని పేర్లు పెడతారు. ఆవులను సీత, లక్ష్మి, గౌరి అనే పేర్లతో పిలుస్తారు. వాటిపై చీరలు, పంచెలు అలంకరణగా వేసి వీధులలో ఊరేగిస్తారు.

సంక్రాంతి కేవలం మానవులకేగాక పశుపక్షి మృగాదులకు కూడా ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తుంది. సాయంకాలమయ్యేసరికి పక్షులు ఎంతో ఆనందంగా వాటి భాషలలో పాటలు పాడుకొంటూ గూటికి చేరుకుంటాయి. పశువుల మందలు వాటి బిడ్డలకోసం ఎంతో ఆత్రుతగా ఇంటికి తిరిగి వస్తాయి. వాటి బిడ్డలు కూడా ఎంతో ఆత్రంగా 'అంబా' అంటూ తల్లిదగ్గరకు చేరుకుంటాయి. ఈ దృశ్యాలు మనసుకు ఎంతో ఉల్లాసం కలిగిస్తాయి.

**పశువులకంటే హీనంగా ప్రవర్తిస్తున్న ఆధునిక మనిషి**

ఈనాడు పశుపక్షిమృగాదులు తమ జాతినీతులను అనుసరిస్తూ ఆనందంగా కాలము గడుపుతున్నాయి. కాని, మానవుడు మాత్రం నీతినిజాయితీలను కోల్పోయి ఆనందానికి నోచుకోలేకపోతున్నాడు. ఆధునికవిద్య ప్రభావముచేత మానవునిలో మానవత్వము క్షీణించింది. ఆధునిక విద్యలు నేర్చి, ఆధునికమైన డ్రస్సులు వేసుకొని పశువులకంటే హీనంగా ప్రవర్తిస్తున్నాడు.

ఈనాడు మనుష్యులకంటే పశువులే మేలుగా కనిపిస్తున్నాయి. ఏమూలకు వెళ్ళినా, ఏదారికి



sri sathyasai vahanamrutam

వెళ్ళినా, ఏగుట్టకు వెళ్ళినా ఏ కొంపకు వెళ్ళినా ఎక్కడ చూచినా ధనము, ధనము! ధనము నిమిత్తమై మానవుడు ఎన్నియో ఆటలాడుతున్నాడు. తన మానమును, గౌరవమును, ఆనందమును బజార్లో పెట్టి అమ్ముకొంటున్నాడు. సంపాదించేకొద్దీ మానవునికి తృప్తి దూరమైపోతున్నది. కాని, పశువులు ఆరీతిగా కాదు. అవి తమకు ఎంత అవసరమో అంత ఆహారము సంపాదించుకొని తృప్తిచెందుతాయి. కడుపు నిండిన తక్షణమే పశువులుకూడా పచ్చగడ్డిని వదలిపెడతాయి. కాని, మానవుడు అట్లాకాదు. తినేకొలదీ యింకా కావాలి, యింకా కావాలని కడుపును పెంచుకుంటున్నాడు.

మీరు ఎక్కడైనా పెంపుడు కుక్కలను చూడండి. ఆ కుక్కలకు జ్వరం వచ్చినప్పుడు మనం బలవంతాన వాటి నోరు తెరచి పాలు పోసినా అవి త్రాగవు. జ్వరం వచ్చిన సంగతిని అవి గ్రహించి ఆహారాన్ని దూరం పెట్టేస్తాయి; పస్తుంటాయి. పశువులుకూడా అనారోగ్యం కలిగినప్పుడు పథ్యాన్ని పాటిస్తాయి; ఏమి పెట్టినా తినవు. ఇక, మనిషిని చూస్తామా... తనకు కొద్దిపాటి జ్వరం వచ్చిందంటే ముసుగు పెట్టుకొని పడుకుంటాడు. కాని పథ్యాన్ని మాత్రం పాటించడు; తినరాని పదార్థాలను తిని రోగాన్ని పెంచుకుంటాడు. నేడు మనుష్యుల పద్ధతి పశువులకు మారిపోయింది. పశువుల పద్ధతి మనుష్యులకు మారిపోయింది. పిల్లల ప్రవర్తన సరిగా లేకపోతే 'ఏమిరా! నీవు పశువువలె ప్రవర్తిస్తున్నావే' అని పెద్దలు మందలిస్తారు. ఈనాటి మానవుని ప్రవర్తన దినదినమునకు దిగజారిపోతున్నది. ఇది ఆధునికవిద్య ప్రభావమే!

ఈనాటి విద్యార్థులు B.A., M.A. లు చదివి డిగ్రీలు పెంచుకుంటున్నారు. కాని, ఆ డిగ్రీలకు D అనే అక్షరాన్ని అనగా, Dirty qualities (దుర్గుణాలని) కూడా చేర్చి BAD గా, MAD గా తయారౌతున్నారు. సద్గుణములు, సదాచారములు, సత్ప్రవర్తన, సచ్చింతన మానవునిలో అభివృద్ధి కావాలి. Money comes and goes, but moralitry comes and grows. కాని, నీతినిజాయితీలను యీనాడు బజార్లో పెట్టి అమ్ముకొంటున్నారు; పశువులకంటే హీనంగా ప్రవర్తిస్తున్నారు. మానవుడు మొట్టమొదట తన ప్రవర్తనను మార్చుకోవాలి.

ప్రేమస్వరూపులారా! కనీసం ఈ సంక్రాంతి నుండైనా సద్గుణములను పోషించుకోండి. భారతీయుల పర్వదినములన్నీ ఉత్తమమైన నీతులను బోధించే నిమిత్తమై ఏర్పడినవేగాని కేవలం

sri sathyasaivachanamrutam

పాయసమును, పరమాన్నమును చేసుకొని తినటం కోసం కాదు. నడతలు మారాలి. నడతలు మార్చే నిమిత్తమై పర్వదినములు ఏర్పడినవి. అన్ని పండుగలకంటే సంక్రాంతి అత్యంత మధురమైనది. ఇటువంటి సంక్రాంతిని మనము ఏరీతిగా గడుపుతున్నాము? ఈనాటి ప్రజలలో ఉత్సాహము చల్లబడిపోయింది. ఒకరిపట్ల ఒకరు ద్వేషాసూయలచేత, ఈర్ష్యచేత కలహములను పెంచుకొని ఆనందమును దూరం చేసుకొంటున్నారు.

**కలియుగం కాదు : కలహయుగం, కల్మషయుగం**

నేడు కుటుంబాలలో ఐకమత్యం క్షీణించిపోయింది. కుమారునికి వివాహము చేసినారంటే కోడలు యింటికి వస్తుంది; వచ్చిన రెండవ దినమే ఆమె ఆ యింటిని రెండుగా విభజిస్తుంది. ఈవిధంగా వేరుకావటంచేత ఇంట్లో కలహాలు పెరిగిపోతున్నాయి. ప్రాచీన కాలంలో అత్తమామలు, తల్లిదండ్రులు, బావమరుదులు.. అందరూ కలసి ఉమ్మడి కుటుంబంగా ఒకే ఇంటిలో నివసించేవారు. ఒకరికొకరికి మధ్య ఏమైనా అభిప్రాయ భేదములు తలెత్తితే పెద్దవారు తగినరీతిగా సలహాలిచ్చి సమస్యలను పరిష్కరించేవారు. ఇంట్లో కలహములే ఉండేవి కావు. పెద్దవారి ఆజ్ఞను శిరసా వహించేవారు.

కాని ఈనాడు కుటుంబములో కలహములు పెరిగిపోతున్నాయి. ఈ కలియుగమునకు కలహయుగమని పేరు వచ్చింది. ఇది కల్మషయుగముగా మారిపోయింది. ఎవరి నోటవిన్నా కఠినమైన పలుకులే వస్తున్నాయి. పూర్వం ఎవరైనా అతిథులు యింటికి వస్తే "ఏమండీ! బాగున్నారా? రండి, భోజనం చేయండి" అంటూ సాదరంగా ఆహ్వానించేవారు. ఆ మృదు మధురమైన పలుకులను విని అతిథులు భోజనం చేసిన దానికంటే ఎక్కువగా సంతృప్తి చెందేవారు. కాని ఈనాడు పండుగరోజుల్లోకూడా ఒకరింటికి ఒకరు పోవటానికి వీలులేకుండా ఉన్నది. స్నేహితులెవరైనా వస్తున్నారంటే తలుపులు మూసుకుంటారు. ఇంతేకాక "ఏమండీ! భోజనం చేసి వచ్చారు కదా! కూర్చోండి" అంటారు. ఆకలిగొని వచ్చిన అతిథులకు పిడికెడు అన్నమైనా పెట్టే విశాల భావము ఈనాడు కరవైపోయింది. చిన్న పిల్లల్లో కూడా ఇటువంటి వికారమైన భావములను పెంచుతున్నారు.

ఈనాటి తల్లిదండ్రులు ఏవో పెద్దపెద్ద చదువులు చదివితే గొప్పగొప్పజీతములు వస్తాయని

sri sathyasai vahinamrutam

ఆశిస్తున్నారు. ఐదు సంవత్సరముల పిల్లలను ఎక్కడో దూరంగా ఉన్న కాన్వెంటుకి పంపుతున్నారు. పిల్లలను ఆయాను పెట్టి పెంచుతున్నారు. తద్వారా వారికి తల్లిప్రేమను దూరం చేస్తున్నారు. అటువంటి పిల్లలు ఆయా చచ్చిపోతే ఏడుస్తారుగాని, అమ్మ చచ్చిపోతే ఏడవరు. నిజానికి పిల్లలు ఎప్పుడూ తల్లిదగ్గరే పెరగాలి. తల్లియొక్క ప్రేమవాక్యములను వినాలి. ఈ ఆధునికవిద్యలు పిల్లలను ఏమాత్రం ఉద్ధరించలేకపోతున్నాయి. వీటివల్ల పిల్లలలో గుణములు అభివృద్ధి కావడం లేదు.

*ఎమ్మేలు బియ్యేలు ఏర్పడ చదివియు*
*పేరు గాంచిన పెద్దవారలైన*
*సంపదలుండియు సద్దానపరులయి*
*పుడమి కీర్తిని గన్న పుణ్యులైన*
*ఆయురారోగ్యంబులనవరతంబుండి*
*పరిపూర్ణ బలులగువారలైన*
*సతతంబు జపములు తపములు చేయుచు*
*వేదంబులను నేర్చు విప్రులైన*
*సాటిరారు గుణవంతులకు ఏనాటికైన*

ఏమిటీ ఆధునికవిద్య? డిగ్రీలను పెంచుకుంటున్నారేగాని హృదయాన్ని పెంచుకోవటం లేదు. హృదయాన్ని విశాలం గావించే చదువే నిజమైన చదువు. ఈనాడు చదువులు చదివేకొద్దీ మనసు మరింత సంకుచితంగా మారిపోతున్నది. విద్యావంతునిలో తాను గొప్ప చదువరిననే అహంభావము పెరిగిపోతున్నది. మన పవిత్రమైన భారతీయసంస్కృతి ఎంతయో కాలమునుండి నీతినిజాయితీలను పోషిస్తూ వచ్చింది. కాని, ఈనాడు ఆ నీతి ఎక్కడా కనిపించటం లేదు. పోనీ, కొంచెమైనా ఆనందము చిక్కుతున్నదా? అదీ లేదు. ఇలాంటి చదువులు మానవుని ఉద్ధరించగలవా?

విద్యార్థులు డిగ్రీలు తీసుకుని విదేశాలకు బయలుదేరుతున్నారు. తమవద్దకు తల్లిదండ్రులు వస్తే 'హోటల్‌కు పోయి తినండి' అంటారు. తల్లిదండ్రులకు ప్రీతితో పిడికెడు అన్నమైనా పెట్టే సద్గుణము ఈనాటి చదువరులలో శూన్యమైపోయింది. తల్లిదండ్రులు పెద్దవారైపోగానే పిల్లలు

sri sathyasai vachanamrutam

ప్రాపర్టీ (ఆస్తి)లో మా భాగము మాకిమ్మని అడుగుతున్నారు. 'ప్రాపర్టీ'ని కోరుతున్నారేగాని 'ప్రాపర్‌మైండ్'ను కోరటం లేదు. 'ప్రాపర్‌మైండ్' రావాలి. అదే ఉన్నతస్థితికి గొనిపోతుంది. చదువుతోపాటు గుణములుకూడా పెరగాలి. తల్లిదండ్రులను పోషించాలి. వారిని దగ్గరకు చేర్చుకోవాలి. వయస్సు వచ్చేకొలదీ వారిని ఎంతో భద్రంగా కాపాడుకోవాలి.

**మీ భవిష్యత్తు మీ ప్రవర్తనపైననే ఆధారపడి ఉంది**

పూర్వం ప్రేమచంద్ అనే ఒక ప్రముఖ హిందీ పండితుడు తన ఇరువురు కుమారులను చదువు నిమిత్తం అలహాబాద్‌కి పంపించాడు. ఒక పర్యాయం తల్లిదండ్రులు ట్రైనులో అలహాబాదు మీదుగా వెళుతూ స్టేషనుకు వచ్చి తమను కలుసుకోవలసిందిగా పిల్లలిద్దరికీ కబురు పంపారు. పెద్దబ్బాయి వస్తూనే వినయవిధేయతలతో తల్లిదండ్రుల పాదాలనంటి నమస్కరించాడు. చిన్నవాడు నమస్కరించలేదు. 'హలో ఫాదర్, హలో మదర్' అన్నాడు. వాని ప్రవర్తన చూసి తల్లికి కాస్త కష్టం తోచింది. "ఇంత చదువు చదివి వీడు నేర్చుకున్నది ఇదా?" అని బాధపడింది. కాని పైకి ఏమీ అనలేదు.

"నాయనలారా! ఎట్లా ఉన్నారు? బాగా చదువుతున్నారా?" అని అడిగింది. పెద్దకుమారుడు, "అమ్మా! మేము చక్కగా చదువుతున్నాము. కాని మా వియోగముచేత మీరు చాలా బాధపడుతున్నట్లు కనిపిస్తోంది. మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి. మీరు బాగుంటేనే మాకు ఆనందము" అంటూ మృదుమధురంగా మాట్లాడినాడు. చిన్నవాడు మాత్రం తల్లిదండ్రుల ఆరోగ్యంగురించి ఏమీ అడుగలేదు. "నాకింకా డబ్బు కావాలి" అన్నాడు. ఇంతలో రైలుకి సిగ్నలు యిచ్చారు. 'నాయనలారా! టైమయింది. మేము వెళుతున్నాము. తిరిగివచ్చేటప్పుడు కలుసుకుందాం' అన్నారు. రైలు బయలుదేరింది. కిటికీలోనుండి చూస్తున్నారు తల్లిదండ్రులు, తమ పిల్లలను. పెద్దకుమారుడు ట్రైను వెళ్ళిపోయేంతవరకు తల్లిదండ్రులకు నమస్కారము చేస్తూ నిల్చున్నాడు. చిన్నవాడు మాత్రం జేబుల్లో చేతులు పెట్టుకొని నిర్లక్ష్యంగా ఎటో చూస్తూ నిలబడ్డాడు. తల్లికి చాలా బాధ కలిగింది.

"మీరు ఈ పిచ్చి చదువు నిమిత్తమై పిల్లలను మననుంచి దూరం చేశారు. చిన్నవాడు పశువు మాదిరి తయారౌతున్నాడు" అని భర్తతో చెప్పి బాధపడింది. "వాడింకా చిన్న పిల్లవాడు. కొంతకాలం పోతే మంచిచెడ్డలు వాడికే తెలుస్తాయి" అన్నాడాయన. "ఇప్పుడే డిగ్రీ కోర్సు

sri sathyasaivachanamrutam

చదువుతున్నాడు. ఇంకెప్పుడు తెలిసేది?" అంటూ తల్లి కన్నీరు తుడుచుకుంది. రైలు కదలిపోయింది. కొన్ని రోజుల తరువాత తల్లిదండ్రులు తిరుగు ప్రయాణంలో స్టేషనుకు వచ్చి తమను కలుసుకోవలసిందని పిల్లలకు జాబు వ్రాశారు. పెద్దవాడు వచ్చి తల్లిదండ్రులకు నమస్కరించి ప్రేమగా మాట్లాడాడు. రెండవవాడు మాత్రం రాలేదు. తల్లిదండ్రులు వ్రాసిన జాబును లెక్కచేయకుండా వాడు సినిమాకు పోయాడు.

కొంతకాలానికి పిల్లల చదువు ముగిసింది. పెద్దవానికి ఉన్నతమైన ఉద్యోగం లభించింది. రెండవవానికి క్లర్కు పని చిక్కింది. ఎంత ప్రయత్నించినా వానికి మంచి ఉద్యోగం లభించలేదు. వాని ప్రవర్తనే అందుకు మూలకారణము. పెద్దవాడు తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి "మీ ఆశీర్వాదబలముచేతనే నాకు ఈ పెద్ద ఉద్యోగం లభించింది" అన్నాడు. తల్లి అతనిని దగ్గరకు తీసుకొని "నాయనా! నీ మంచి గుణములే నీకు ఉన్నతస్థానము నందించాయి" అని చెప్పింది. చిన్నవాని నిర్లక్ష్యధోరణివలన కొంతకాలానికి ఆ క్లర్కు ఉద్యోగము కూడా ఊడిపోయింది. పెద్దవానికి మాత్రం గొప్ప ప్రమోషన్ వచ్చింది. అందరూ వచ్చి అతనికి నమస్కరిస్తున్నారు. తల్లిదండ్రులకు నమస్కారం చేయని చిన్నవాడు మాత్రం చిన్నచిన్న క్లర్కులకుకూడా నమస్కారం చేయవలసివచ్చింది.

**"యద్భావం తద్భవతి".**

మీభవిష్యత్తు మీ ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటుంది. మీరు తల్లిదండ్రులను గౌరవించనప్పుడు కుక్కలు కూడా మీ ముఖం చూడవు. మీరు ఏ దేశం పోయినప్పటికీ, ఎంతటి ఉన్నతస్థాయికి చేరినప్పటికీ తల్లిదండ్రులను మరువకూడదు. వేదము "మాతృదేవోభవ, పితృదేవోభవ" అని బోధిస్తున్నది. కాని, ఆధునికవిద్యలు తల్లిదండ్రులనుకూడా మరిచేటట్లు చేస్తున్నాయి. ఇట్టి చదువులవలన కలిగే లాభమేమిటి? తల్లిదండ్రులను గౌరవించి, తల్లిదండ్రుల ఆజ్ఞను శిరసావహించేవాడు ఎంతో ఉన్నత స్థానాన్ని పొందుతాడు.

విద్యార్థులారా! మీ తల్లిదండ్రులు అనేక కష్టములకోర్చి మిమ్మల్ని పోషిస్తున్నారు. వారికి తినటానికి తిండి లేకపోయినా సరే, మీకు తెచ్చిపెడుతున్నారు. మీరు బాగు పడాలని మీకు మంచిచదువులు చెప్పిస్తున్నారు. అట్టి తల్లిదండ్రులను మీరు గౌరవించకపోతే లోకం మిమ్మల్ని ఏవిధంగా గౌరవించగలదు? ఈనాడు సంక్రాంతి అంటే, మంచిమార్పుగొనివచ్చేది. మనలో

మార్పు రావాలి. చెడ్డగుణములు పోవాలి. సదభ్యాసములు, సద్గుణములు అభివృద్ధి కావాలి. ఇదియే మన పండుగలు నేర్పేది. ఇలాంటి పవిత్రమైన పండుగలను జరుపుకోవలసిన రీతిగా జరుపుకోవడం లేదు.

## అబ్రహాం లింకన్ ఆదర్శం

అమెరికాదేశమునకు గతంలో అధ్యక్షునిగా ఉన్న అబ్రహాం లింకన్ చాలా బీద కుటుంబంలో పుట్టాడు. తల్లి పాతగుడ్డలను కుట్టగా వచ్చిన డబ్బుతో పిల్లవానిని పోషిస్తూ వచ్చింది. ఒకనాడు అతను శ్రీమంతులైన తోటివిద్యార్థులతో కలసి స్కూలుకి వెళుతూ ఉండగా వారతనిని బీదవాడని హేళనచేస్తూవచ్చారు. లింకన్ ఏడ్చుకుంటూ యింటికి వచ్చి "అమ్మా! నావి పాత గుడ్డలట. నేను బీదవాడినట. నాతో వారు చేరరట. నాస్నేహము వారికి అక్కర్లేదట. ఈ చదువు నాకు వద్దు. యీ పిల్లలతో నేను స్కూలుకి పోలేను" అన్నాడు. తల్లి అతనిని దగ్గరకు తీసుకొని "నాయనా! మనం ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నాము. కూలీనాలీ చేసి పొట్ట నింపుకుంటున్నాము. ఈవిషయమును గుర్తు పెట్టుకో, ఎవరూ నిన్ను గౌరవించటంలేదని నీవు బాధపడవద్దు. నీవు ఇతరులను గౌరవిస్తే తప్పక నీకుకూడా గౌరవము లభిస్తుంది. ఆత్మగౌరవమును పెంచుకో. ఆత్మవిశ్వాసముతో జీవించు. తప్పక ఉన్నతస్థితికి వస్తావు" అని చెప్పింది. లింకన్ తల్లి హితోక్తులను మనస్సులో పెట్టుకున్నాడు. ఆత్మవిశ్వాసమును అభివృద్ధి పరచుకున్నాడు. అందరినీ గౌరవిస్తూ అందరిచేత గౌరవింపబడుతూ మంచిపేరు తెచ్చుకున్నాడు. అతని మిత్రుల ప్రోద్బలంచేత ఎలక్షన్లలో పోటీ చేసి ఘనవిజయం సాధించాడు. క్రమక్రమేణ అమెరికా దేశానికి ప్రెసిడెంటు అయ్యాడు. అతను బీదకుటుంబములో జన్మించినప్పటికీ తన తల్లి బోధనలను అనుసరించి, అందరినీ గౌరవించటంచేత అంతటి గౌరవస్థానం పొందగలిగాడు. తల్లినే తన దైవంగా భావించి పూజిస్తూ వచ్చాడు. అతనికి సద్బుద్ధులు నేర్పినది ఆమెయే! ఎవరు మంచిబుద్ధులు నేర్పుతారో వారే మనకు దైవం. దైవం ఎక్కడో లేదు; ఆత్మగౌరవంలోనే ఉన్నాడు. ఆత్మగౌరవాన్ని పోషించుకుంటే అందులోనే మనకు ప్రత్యక్షమవుతాడు.

నిజంగా చూస్తే లింకన్ దగ్గర ధనంలేదు. కాని, గుణం మాత్రం దండిగా ఉంది.

srisathyasaivachanamrutam

"అయ్యో! నాకు పెద్దపెద్ద భవనాలు లేవు. వారంతా భవనాల్లో ఉంటున్నారు" అని అతను ఏనాడూ విచారించలేదు. "నాకు మేడలు లేకపోయినా ఫరవాలేదు, నిలువడానికి నీడ ఉంది. నాకు కార్లు లేకపోయినా ఫరవాలేదు, భగవంతుడు ఇచ్చిన కాళ్లున్నాయి" అని సంతృప్తిచెందుతూ వచ్చాడు. కట్టకడపటికి తానే గొప్పస్థితికి వచ్చి అందరికీ సహాయం చేస్తూ వచ్చాడు. ఆ రోజుల్లో అమెరికాలో నల్లజాతివారిని బానిసలుగా చూసేవారు. లింకన్ వారినందరినీ గౌరవించి, ఆదరించాడు. వారికి బానిసత్వమునుండి విముక్తి ప్రసాదించాడు. మనం బీదవారం కావచ్చు. అంతమాత్రమున వగచనక్కర్లేదు. ఆత్మవిశ్వాసముతో జీవించాలి, ఆత్మగౌరవమును పోషించుకోవాలి. తప్పక మనకు గౌరవం దక్కుతుంది. కొందరు బీదవారిని చూస్తే పొమ్మంటారు. అది చాలా పొరపాటు. వారినే మనం ఆదరించాలి, గౌరవించాలి. అయితే, మనము గౌరవింపబడాలనే ఉద్దేశ్యంతో గౌరవించవద్దు. గౌరవించటం మన స్వభావం కావాలి. మానవుని గౌరవింపచేసేది, ఉన్నతస్థాయికి తీసుకొనిపోయేది ఆత్మగౌరవమే. మన ఆత్మగౌరవమే మనలను రక్షిస్తుంది.

**గొప్పవారు కానక్కర్లేదు, మంచివారు కండి**

పిల్లల్లారా! మీ తల్లిదండ్రులు ఎటువంటి స్థితిలో ఉన్నప్పటికీ వారిని మీరు గౌరవించాలి. వారికి తలవంచాలి. వారి మాటలు వినాలి. అప్పుడే మీకు గౌరవము లభిస్తుంది. ప్రాచీనకాలంలో భారతీయులు గొప్పగొప్ప భవనాలు కట్టి వాటికి చిన్నచిన్న తలుపులు పెట్టేవారు. ఎందుకోసం? ఎవరైనా సరే, ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు తలవంచుకొని రావాలి. మనం యితరుల ఇంటికి వెళ్ళినా తలవంచుకొని వెళ్ళాలి. ఇటువంటి ప్రాచీన పద్ధతులను ఈనాడు భారతీయులు మరచిపోయారు. ఈనాడు ఇళ్ళకు గడపనుకూడా పెట్టుకోవడం లేదు. ఎందుకంటే, దానిని దాటుకొని పోవటం వారికి చాలా కష్టంగా ఉన్నది! ప్రాచీన భారతీయులు తమ ప్రతి ఆచారములోను వినయ, భక్తి విశ్వాసములను చేర్చుకుంటూ వచ్చారు.

విద్యార్థులారా! మీరు ఇటువంటి పవిత్రగుణములను అలవర్చుకొని గౌరవాన్ని అందుకోవాలి. దైవానుగ్రహము కావాలంటే పూజలూ పునస్కారాలూ చేస్తే రాదు. పెద్దపెద్ద

sri sathyasaivacharamrutam

చదువులు కేవలం అహంకారమును పెంచుతాయిగాని వినయ, భక్తి, విశ్వాసాలను పెంచవు. వినయ, భక్తి, విశ్వాసాలను పెంచుకున్నప్పుడే మీరు మంచివారౌతారు. మీరు గొప్పవారు కానక్కర్లేదు. మంచివారు కండి. గొప్పపేరు యీ పొద్దు వస్తుంది, రేపు పోతుంది. కాని, మంచిపేరు శాశ్వతంగా నిలిచి ఉంటుంది. కాబట్టి, Good name (మంచి పేరు) తెచ్చుకోండి. Greatness (గొప్పతనం) కోసం ప్రాకులాడకండి.

భగవంతుని Grace (అనుగ్రహము)ను అందుకోవటానికి మీరు ప్రయత్నించండి లౌకికవిషయములనే Grass ను (గడ్డిని) కోరుకోవద్దు. Grass పశువులు తినేది. Grassను ఆశించటంవలన మనుష్యులు పశువులుగా తయారౌతున్నారు. మనం గ్రేస్‌ (ప్రజ్ఞాబిబీలి) ను సంపాదించుకోవాలి. దైవానుగ్రహాన్ని సాధిస్తే అన్నింటినీ సాధించినవారమవుతాము. విద్యార్థులారా! సంక్రాంతి పర్వదినాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ సందర్భముగా మనం పెంచుకోవలసినది ఇతరులను గౌరవించి, మనము గౌరవాన్ని అందుకొనే సుగుణము. తల్లిదండ్రులకు మంచిపేరు తెప్పించండి.

(శ్రీవారు ఒక విద్యార్థిని వేదికపైకి పిలిచి) ఈ పిల్లవాడు అమెరికానుండి వచ్చాడు. మన స్కూలులో చదువుకొంటున్నాడు. అన్ని క్లాసుల్లోను ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడవటమేకాక వేదముకూడా నేర్చుకుంటున్నాడు. ఏ ప్రశ్నము అడిగినా చక్కగా చెబుతాడు. ఇలాంటి అదృష్టవంతుడైన కుమారుడు పుట్టటం తల్లిదండ్రుల యొక్క భాగ్యమే! అటువంటి తల్లిదండ్రుల వల్లనే పిల్లలు కూడా సద్గుణవంతులౌతున్నారు. ఇతని తల్లిదండ్రులు ఎక్కడో అమెరికాలో నివసించేవారు. అక్కడ వారికి సకల సదుపాయములున్నాయి. కాని, వాటిని త్యజించి, ఇండియాలో సద్గుణములు, సద్బుద్ధి, సదభ్యాసములు నేర్పించాలని తమ పిల్లలను ఇక్కడకు తీసుకువచ్చారు.

ఆ పిల్లలు భారతీయసంస్కృతిని చాలా ప్రేమిస్తున్నారు. ఇంతమందిలో తన కుమారునికి మంచిపేరు వచ్చిందని తండ్రి ఎంతో ఆనందిస్తున్నాడు. (తండ్రిని చూపుతూ)ఇతనే ఈ పిల్లవాని తండ్రి. తల్లి మన ప్రైమరీ స్కూల్లోనే టీచరుగా పనిచేస్తూ ఎంతో ఆనందంగా ఉన్నది. ఈ పిల్లవాడు గౌరవమర్యాదలతో మసలుకోవటం వలన ఇతని తల్లిదండ్రులుకూడా ఎంతో గొప్ప గౌరవమర్యాదలు పొందుతున్నారు. ఈరీతిగా ప్రతి విద్యార్థీ తన తల్లిదండ్రులకు మంచి గౌరవము

srisathyasaivachanamrutam

తెప్పించాలి. ధనము సంపాదించి మిద్దెలు, మేడలు నిర్మించటంవల్ల పేరు రాదు. ఈనాడు వచ్చినవి రేపటికి పోతుంటాయి. కాని, సత్కీర్తి ఒకతూరి వస్తే శాశ్వతంగా నిల్చిపోతుంది. అది ఎప్పటికీ మాసిపోయేది కాదు, పాసిపోయేది కాదు. అట్టి మంచిపేరును మీరు సంపాదించుకోండి. అప్పుడే మీరు నిజంగా సత్యసాయి విద్యార్థులనిపించుకుంటారు.

**"నా పెద్ద ప్రాపర్టీ ప్రేమయే!"**

ప్రేమస్వరూపులారా! మీకు తెలుసు. విద్యార్థుల నుండి మేము ఒక్క నయాపైస కూడా అందుకోవటంలేదు. ఇంకా వారికేమైనా పుస్తకాలు అవసరమైతే నేనే కొని ఇస్తానుగాని, వారిదగ్గరనుండి నేను యేమీ పుచ్చుకోవటం లేదు. అందువల్లనే వారి ప్రేమ నాపైన, నాప్రేమ వారిపైన యింతగా అభివృద్ధి అవుతున్నది. తల్లిదండ్రులను విడిచి విదేశాలకు వెళ్ళేటప్పుడుకూడా వారు అంతగా బాధపడరుగాని, ఒక దినము నేను బృందావనానికి వెళ్ళి కాలేజీలో పిల్లలను చూసి పుట్టపర్తికి వాపసు వస్తుంటే ఏడుస్తారు పిల్లలు. ఈ ప్రేమ వారికి ఎక్కడినుంచి వచ్చింది? స్వామియొక్క ప్రేమనుండియే! నేను అందరికీ అందించేది ప్రేమ ఒక్కటే! నా ఆస్తి మేడలూ మిద్దెలూ కావు. నా పెద్ద ప్రాపర్టీ ప్రేమయే. నా ప్రేమను ఇస్తున్నాను, వారి ప్రేమను పుచ్చుకుంటున్నాను. నేను ఎప్పుడూ పిల్లలను కోరేది అదే 'నాయనా! మీ ప్రేమను నాకు యివ్వండి. మీకు ఏది కావాలసినా నేను ఇస్తాను'. అందువల్లనే పిల్లలకు నాపై అంత ప్రేమ. మీ తల్లిదండ్రులపై అటువంటి ప్రేమను పెంచుకోండి. తల్లిదండ్రుల ఆజ్ఞ ప్రకారము నడుచుకోండి. తప్పక మీరు ఉద్ధరింపబడతారు. మీరు ఎక్కడ ఉండినప్పటికీ మనసులో దైవాన్ని తలచుకుంటూ రండి.

అడవిలోనన్నున్న ఆకాశమున నున్న
పట్టణమున నున్న పల్లెనున్న
గుట్టమీద నున్న నట్టేటబడియున్న
*దిక్కులేనివానికి దిక్కు ప్రేమ ఒకటె!*

ఆ ప్రేమ ఒక్కటే మీవెంట, జంట, ఇంట ఉండి మిమ్ములను కంటికి రెప్పవలె కాపాడుతూ వస్తుంది.

(2004 జనవరి 12వ తేదీ ఉదయం సాయికుల్వంత్ లో  భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)

sri sathyasai vahini